వర్షాకాలంలోనూ తాగునీటి సమస్య

- తంటాలు పడుతున్న గ్రామస్తులు
- వారం దాటినా రాని భగీరథ నీరు


సూరంపల్లిలో జెట్‌పంపు వద్ద గుమిగూడిన గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): వర్షాకాలంలో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంతో వారానికి పైగా తాగునీటి కోసం తహతహలాడాల్సిన దుస్థితి నెలకొన్నది. గ్రామ ప్రత్యేకాధికారి పత్తాలేకపోవడం, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు గ్రామానికి రావడం లేదు. దీంతో గ్రామంలోని ఒకే జెట్‌పంపు బోరు వద్ద గ్రామస్తులు బిందెలతో గుమిగుడాల్సిన దుస్థితి నెలకొంది. కరెంట్ ఉన్న సమయంలోనే నీటికి పట్టుకోవాల్సి వస్తుందని, వాటర్ ట్యాంక్‌లను కూడి సరిగ్గా శుభ్రం చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యతో పాటూ విద్యుత్, మురుగు కాల్వలతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సరిగ్గా వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు తప్పడంలేదని చెబుతున్నారు. మురుగు కాల్వలు అపరిశుభ్రంగా మారడంతో దుర్గంధం వెదజల్లి అనారోగ్యాల పాలవుతున్నామని తెలిపారు.

తొంగిచూడని అధికారులు

ప్రత్యేకాధికారుల పాలన నుంచి ఏ అధికారి గ్రామాన్ని తొంగి చూడడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య ఎక్కడ ఏర్పడింది, ఎలా పరిష్కరించాలని కనీసం ఎవరూ.. తెలుసుకోవడంలేదని వారు మండిపడుతున్నారు. మౌలిక వసతులు విషయమై ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి ... తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

- సిద్దేశ్వర, కూచాద్రి వెంకటేశ్వరాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పూజలు


సిద్దేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

హవేళీఘణాపూర్(మెదక్): కూచాద్రి వేంకటేశ్వర స్వామి కృపతో మెదక్ అభివృద్ధికి కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ముత్తాయికోట సిద్దేశ్వరాలయం, కూచన్‌పల్లి కూచాద్రి వేంకటేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆలయ ఇన్‌చార్జి ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అలాగే ముత్తాయికోట సిద్దేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ప్రజలకు అందుబాటులో వారి సమస్యల పరిష్కారం దిశగా పని చేస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఎంఎల్ఎన్ రెడ్డి, నందారెడ్డి, శ్రీపాల్, మల్లేశం తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట కన్యకా పరమేశ్వరి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఉత్సవ కమిటీ ఆహ్వాన పత్రిక అందించింది. 21 నుంచి మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు హన్మయ్య రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్, ఏపీఓ శ్యాంకుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షకాలం సీజన్ ప్రారంభమైందని, సమష్టి కృషితో హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆనంద్, ఏపీఓ శ్యాంకుమార్ అన్నారు. గురువారం వారు మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి పనిలో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టాలన్నారు. ఈ హరితహారం సీజన్‌లో ఆయా గ్రామాల్లోని నర్సరీలో పెంచిన మొక్కలను నాటాలని, అందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ భగవంత్‌రెడ్డి, టీఏలు విఠల్, హనుమండ్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ


బొడ్మట్‌పల్లిలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అన్ని రకాల వసతులతో ప్రైవేట్‌కు దీటుగా బోధన చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ యాదమ్మ, ఉపాధ్యాయులు రాణి, అశోక్, స్వప్న, లత తదితరులతో పాటూ విద్యార్థులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను అందజేశారు. చేగుంట ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను అందజేసి మండల నోడల్‌కు ఆఫీసర్ నీరజ మాట్లాడారు. చెట్లతిమ్మాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డికి పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, లక్ష్మణ్, వెంకటేశ్, చక్రధర్‌శర్మ, రమ, సురేందర్, బాలరాజు, సుధాకర్, రేణుక, అరుణ, హరిరంజన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు


వెల్మకన్న ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు చూస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం విద్యార్థులకు డిజిటల్ తరగతులు చూపించారు. హెచ్‌ఎం సరోజ ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్ తదితరులు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నీతికథలు, సైన్స్, గణితం తదితర డిజిటల్ తరగతులను చూపించారు. పాఠశాల ప్రారంభం కావడంతో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో విద్యార్థులను ఆకర్షించేందుకు పాఠశాలలోని టీవీల్లో డిజిటల్ తరగతులు చూపించినట్లు చెప్పారు.

స్కూల్ డ్రెస్ పనుల్లో ఐకేపీ సిబ్బంది


అల్లాదుర్గం ఐకేపీ కార్యాలయంలో విద్యార్థుల డ్రెస్‌లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా డ్రెస్‌లను అందజేస్తుంది. మహిళలు ఉపాధితో లబ్ధి పొందాలని డ్రెస్‌లను కుట్టేందుకు ఈసారి డ్వాక్రా గ్రూప్ మహిళలకు అప్పగించారు. దీంతో వారు కుట్టిన డ్రెస్‌లను లెక్కిస్తూ బాలుర, బాలిక దుస్తులు వేరు చేసే పనిలో అల్లాదుర్గం ఐకేపీ సిబ్బంది నిమగ్నమయ్యారు. అల్లాదుర్గం ఏపీఎం నాగరాజు, ఐకేపీ సీసీలు కార్యాలయంలో పాఠశాలలకు దుస్తులు పంపిణీకి ఏర్పాటు సిద్ధం చేస్తున్నారు. మండలంలో 2446 మంది విద్యార్థులకు దుస్తులు అందజేయనున్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం ఉమ్మడి మండలం పోతులబోగూడ మోడల్ స్కూల్‌లో పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రిన్స్‌పాల్ మల్లిక తెలిపారు. బాటనీ, ఇంగ్లీష్ సబ్జెక్టులు ఖాళీ ఉన్నాయని ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్‌లో ఇంటార్వ్యూ, డెమోకు హాజరు కావాలన్నారు. పీజీ బీఈడీ, డిగ్రి బీఈడీ అర్హత ఉండాలన్నారు. పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లకు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కామారంతండాలో కలుషిత తాగునీరు

- ఎంపీడీఓ కార్యాలయంలో గిరిజనుల ఫిర్యాదు


ఫిర్యాదు అందిస్తున్న కామారంతండా గిరిజనులు

చిన్నశంకరంపేట(మెదక్): కలుషిత తాగునీరు వస్తుందని మండలంలోని కామారంతండా గిరిజనులు కలుషిత నీటిని తీసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీడీఓ లేకపోవడంతో గిరిజనులు సూపరింటెంటెంట్ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తమతో తీసుకొచ్చిన కలుషిత నీటిని కూడా అధికారికి చూపించారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని, గ్రామ కార్యదర్శికి చెప్పినా.. స్పందించడంలేదన్నారు. ఇదే విషయంపై కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపినాయక్, మోహన్‌నాయక్, యస్‌రామ్, కుమార్ ఉన్నారు.

పెరిగిన జీలుగను పొలంలో దున్నాలి

- ఏఈఓ విజ్యంభణ


నార్సింగిలో జీలుగ సాగును పరిశీలించి, సూచనలు ఇస్తున్న ఏఈఓ విజ్యంభణ

చిన్నశంకరంపేట(మెదక్): జీలుగ విత్తిన రైతులు ఏపుగా పెరిగి పూతదశలో ఉన్న జీలుగను పంటపాలంలోనే దున్నాలని నార్సింగి ఏఈఓ విజ్యంభణ రైతులకు సూచించారు. గురువారం నార్సింగి, నర్సంపల్లిలో జీలుగ సాగుచేసిన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీలుగ ఎదిగే దశలో సాగునీరు అవసరమన్నారు. అలాగే పూతదశకు చేరిన జీలుగను(30 రోజుల్లో) పంటపొలంలో రోటవేటర్‌తో దున్నాలన్నారు. లేదా జీలుగ మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించి కూడా పొలంలో వేసి దున్నవచ్చన్నారు. జీలుగను దున్నిన తర్వాత 100 కిలోల సూపర్ పాస్పేట్‌ను దుక్కిలో వేయడం ద్వారా మొక్కల అవశేషాలు పంట పొలంలో కుళ్లి పచ్చిరొట్ట ఎరువుగా తయారు అవుతుందన్నారు. జీలుగ వల్ల జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ దాతువులను నేలకు అందిస్తున్నారు. సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి కూడా దోహదపడుతుందన్నారు. తద్వారా మంచి దిగుబడి వస్తుందన్నారు.

కొబ్బరిచెట్టుపై పిడుగు

టేక్మాల్(మెదక్): మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన బారీ వర్షం గంటపాటూ దంచి కొట్టింది. వెల్పుగొండ గ్రామంలో చింతకింది ఈశ్వరయ్య ఇంటి పరిసరాల్లో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో గ్రామస్తులంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సబ్ స్టేషన్‌పై..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని రామతీర్థం సబ్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం పిడుగు పడింది. దీంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పగుల్లు వచ్చి కొంతమేర ఆయిల్ నష్టం జరిగింది. దీంతో సబ్ స్టేషన్ షన్ పరిధిలోని మల్లంపేట, రామతీర్థం, ముద్దాపురం, నర్సింగ్ రావు పల్లి తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజల రద్దీ


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బారులు తీరిన ప్రజలు

హవేళీఘణాపూర్(మెదక్): నెల రోజులుగా పార్లమెంట్ ఎన్నికలు జరగడంతో భూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో గురువారం ప్రజలు స్లాట్ బుక్ చేసుకొని రావడంతో హవేళీఘణాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో రద్దీ నెలకొంది. గత నెల రోజులుగా ఎన్నికల నిర్వాహణలో బిజీగా ఉన్న అధికారులు ఎన్నికల కోడ్ ముగియగానే భూములను విక్రయించుకునేందుకు స్లాట్ బక్ చేసుకొని కార్యాలయానికి వచ్చారు. గురువారం 38 మంది స్లాట్ బుక్ చేసుకున్నట్లు తహసీల్దార్ నారాయణ పేర్కొన్నారు. ప్రజలు తమ భూములను విక్రయించే ముందు బ్యాంకు రుణాలు బకాయి ఉంటే వాటిని చెల్లించి క్లియరెన్స్ చేసుకున్న తర్వాతనే స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై ఆరా

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి విద్యుత్‌శాఖ డీఈ కృష్ణారావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. గురువారం పెద్దశంకరంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అన్ని గ్రామాల్లో వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. కోతల విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని సూచించారు. గొట్టిముక్కుల, బద్దారం, గోపనివెంకటాపూర్, వీరోజిపల్లి తదితర గ్రామాల్లో సమస్యలపై ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు విన్నవించారు.

మిల్లర్ల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

వరిధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్ల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. పీఎసీఎస్, ఐకేపీ అధికారులు పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీ మోహన్‌బాబు, ఏఈ శ్రీకాంత్, నాయకులు సురేందర్‌రెడ్డి, మధు, నారాగౌడ్, ఆర్ఎన్.సంతోష్, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, పెరుమాండ్లు, కుంట్ల రాములు, గంగారెడ్డి, కుంట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజామాన్యాలకు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం ఆయన ప్రైవేట్ పాఠశాలల యాజామన్యాలతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజులు సైతం అడ్డగోలుగా వసూలు చేయొద్దని చెప్పారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులను భర్తీ చేసుకొని నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో నర్సాపూర్‌కు గుర్తింపు తేవాలని కోరారు. డబ్బు సంపాదనే ధ్యేయం పెట్టుకోవద్దని, బస్సులు ఫిట్‌నెస్ ఎప్పటికప్పుడు చెక్ చేయించుకోవాలన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల జీవితాలతో ఆటలాడవద్దని హితవు పలికారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. విద్యా హక్కు చట్టం కింద పేదలకు ఉచిత విద్య అందించాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు రాంచందర్, యాదగిరి, భిక్షపతి, బాల్‌రెడ్డి, రమేష్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, పలు పాఠశాలల యాజామాన్యాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు బూట్లు, గ్లౌస్‌లు అందజేత


చిట్కుల్‌లో కార్మికులకు బూట్లు, గ్లౌస్‌లు అందిస్తున్న కార్యదర్శి తిరుపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ పంచాయతీ కార్మికులకు గురువారం బూట్లు, గ్లౌస్‌లు అందజేశామని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సేవలతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. ముఖ్యంగా వర్షకాలం సీజన్ ప్రారంభమైందని, మురికి కాల్వలు, గ్రామాల్లో చెత్తను పరిశుభ్రం చేసే సమయాల్లో అకస్మాత్తుగా వచ్చే పాములు, తేళ్ల నుంచి రక్షణ పొందడానికి బూట్లు, గ్లౌస్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్మికులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోవధను అరికట్టాలి

హవేళీఘణాపూర్(మెదక్): మానవాళి ఆరోగ్య రక్షణకు ఆధారమైన గోమాతను కాపాడాలని, గోవధను అరికట్టేందుకు పోలీసు శాఖ కృషి చేయాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు రాజు, కార్యదర్శి సాయికుమార్ మెదక్ సీఐ కేశవులుకు ఇచ్చిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోవధతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి


ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం తనిఖీ చేస్తున్న ఏఓ

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఎరువుల డీలర్లు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఏఓ స్వప్న తెలిపారు. గురువారం కౌడిపల్లిలో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం, భాగ్యలక్ష్మి ట్రేడర్స్, లక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో రిజిస్టర్లు తనిఖీ చేసి స్టాక్ పరిశీలించారు. కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. అధిక ధరలకు విక్రయించొద్దని చెప్పారు.

తూప్రాన్ అభివృద్ధే ధ్యేయం

సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి


మున్సిపల్ నూతన ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

తూప్రాన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తుందని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి కృష్ణతో కలిసి మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్, వినాయక్‌నగర్‌లోని వీధీలైట్లు ప్రారంభించారు. ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహియొద్దీన్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, భగవన్‌రెడ్డి, నారాయణగుప్తా, రాజు, నాయకులు నర్సాజీ, విశ్వరాజ్, నాగరాజుగౌడ్, ఉమర్, నాగులు, నర్సింలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వసతులు కల్పించాలి


మనోహరాబాద్ పీహెచ్‌సీలో వైద్య పరీక్షల కోసం నిలబడివున్న గర్భిణులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన పీహెచ్‌సీకి తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన 10 సబ్ సెంటర్ల ప్రజలు ఆయా సమస్యలపై వస్తుంటారు. అంతే కాకుండా ప్రతీ గురువారం గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. వారికి కనీస వసతులు లేకపోవడం, కూర్చోవడానికి సరిపోను కుర్చీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పెద్దశంకరంపేట ఇన్‌చార్జి ఏఓగా యాదగిరి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా యాదగిరి నియమితులయ్యారు. గురువారం ఆయన ఏఓగా బాధ్యతలు స్వీకరించారు. నార్సింగ్ మండల కేంద్రం నుంచి పెద్దశంకరంపేటకు బదిలీపై వచ్చారు. అంతకుముందు అల్లాదుర్గం ఏఓగా చేశారు.

◆ సన్మానం

నర్సాపూర్: మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలిస్తే కాలినడకన ఆలయానికి వస్తానన్న మొక్కును తీర్చేందుకు పాదయాత్రగా భూపతి బయలు దేరారు. ఈ సందర్భంగా ఆయనను బీజేపీ మాజీ కన్వీనర్ మల్లేష్‌గౌడ్ శాలువా సన్మానించి అభినందించారు. వెల్దుర్తి మండలంలోని మంగల్‌పర్తి గ్రామ బూత్ అధ్యక్షుడు భూపతిని గురువారం బీజేపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ మార్గమధ్యలో కలిసి అభినందించి సన్మానించారు.

◆ నులిపురుగు నివారణపై అవగాహన

చిన్నశంకరంపేట(మెదక్): నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా అందిస్తున్న అల్బెండజమ్ టాబ్లెట్స్‌ను అర్హులకు అందజేయాలని నార్సింగి ఎంపీపీ సబిత కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీఓ నరేష్, ఎంపీటీసీ సత్యానారాయణ, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

◆ 20న శిక్షణ

చేగుంట(తూప్రాన్): 20న నిర్వహించే నులిపురుగు నివారణ కార్యక్రమం పురస్కరించుకొని ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అనీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

◆ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ స్వరూప అన్నారు. మండలంలోని ఎం.జలాల్‌పూర్, యశ్వంతరావ్‌పేట, మానెపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈఓ యాదగిరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మానెపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ విఘ్నేశ్వర్, హెచ్‌ఎం రవికుమార్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు పోతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు, తదితర డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం వెల్దుర్తిలో నిర్వహించిన జీపీ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో చాలా మండలాల్లో మూడు నుండి ఆరు నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గౌరి, పెంటయ్య, యాదయ్య, శేఖులు, యేసు పాల్గొన్నారు.

◆ ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యులు వికాస్‌లతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో చిన్నారులకు, విద్యార్థులకు నులిపురుగు నివారణకు పలు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం 20 నుంచి 27 వరకు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

◆ ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చండీ గ్రామంలోని చెండీకాంబ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సుబ్రమణ్య స్వామి, గణపతి, ఆంజనేయస్వామి, నవగ్రహా విగ్రహాలు ప్రతిష్ఠించి రెండేళ్ల పూర్తి కావడంతో వార్షికోత్సవాలు నిర్వహించారు.

◆ దరఖాస్తులకు ఆహ్వానం

చిన్నశంకరంపేట(మెదక్): కస్తూర్బా పాఠశాలలో నైట్‌వాచ్‌మెన్‌గా విధులు నిర్వహణకు మహిలా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గీతా అన్నారు. ఈ నెల 16 వరకు పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు అందించాలన్నారు.